# అనుబంధాలు

కన్నెదాన ప్పీట్లమీన కూసున్నాడన్న మాటేగాని, రెడ్డెయ్య దేనం అంతా గొడ్లసాలమీనే ఉంది. పొద్దొడిసిన కాడ్నుంచీ బట్లావేదో ఎర్రిబాద పడుతోంది. ఇప్పటికి మూడు నాలు గీతలేసింది. కాని ఈ మాటంత బాదెప్పుడూ పడనేదు.

ఈమాటైనా పెయ్యదూడెడుతుందేమో ఏంటో ... తన ఆశగానీ ... ప్ఛ ... బట్లావు సంగ్రం ఇంట్లో ఉండే యోగంనేదు. లేకపోతే, ఇన్నీతలీనిందిగదా, అన్నీ కోడిదూడలే ఎట్టాలా? ఏమో! తనదుష్ఠం ఎలా ఉందో!

బట్లావు మాబాదపడుతోంది. పొద్దొడిసేటప్పుడు ఈరిగాడేసిన ఆ నాలుగు పరకలూ అలాగే ఉండిపోనాయి. నిన్న సందేళనగా పోసిన నీళ్లు తొట్టిలో ఆ పళాన్నే ఉన్నాయి. దాగరలో సిట్టు మాత్రం? ఎర్రితల్లి ఏం బాదపడుతోందో! కళ్లంట నీరు కారుతూంటే కత్రాడసుట్టూ అలంగం తిరుగుతూ 'అంబా' అని అరుస్తోంది.

సల్దాన్నాలేళ యీసంగతి ఇన్నప్పుడు కాళ్ళూ సేతులూ ఆడనేదు తనకి. "వొచ్చిన పెళ్లోళ్ళి సుట్టాల్ని మీరు సూసుకోండెహే" అని బావమరుదులికి పూరమాయించి, తానేమో వొచ్చి గొడ్లసాల్లో సతికిలబడ్డాడు. ఏం పాలుబోవడంలేదు రెడ్డెయ్యకి. కొంతసేపు గంగడోలు గోకాడు. దానితోబాటు తనూ కళ్లంట నీళ్లు కారుస్తూ కూసున్నాడు. కుసిన్ని లేత గరికలైతే పీకి పెట్టబోయాడు. ఉహు! ముట్టెతో నెట్టేసింది.

మాపులు సందెడూ, పగటేల మోపూ మేట్లోంచి లాగి ఏస్తే ఇట్టే ఊదేసి, ఆపైన సిట్టుదాగర దగ్గరెట్టేదాకా ఉహు ... తాడు గుంజుతూనే ఉండే ఎర్రితల్లి ఇయాల పట్టెడు పరకలూ, గుక్కెడు నీళ్ళూ కూడా ముట్టుకోకపోవడంతో రెడ్డెయ్య పేణం ఉసూరుమంది. ఇలా రెండు మూడు రోజులైతే ఇంకేమైనా ఉందా? ఈ గండం

గడిస్తే జోడుకోళ్ళు బలేయిస్తానని రావులమ్మకి మొక్కుకున్నాడు. అమ్మోరికి గరగసేయించి ఈరబద్రుడు సంబరం కూడా సేయిత్తానని దణ్ణం ఎట్టాడు.

"మూర్తం ఏల దగ్గిరకొచ్చింది. ఏంటా ఎర్రి? గొడ్లసావిడి వొదిలి రావేంటి?" అని పెళ్ళాం, "ఇంక ఆలస్యం సేత్తే కాదు. రావాలి మరి" అని శాత్తుల్లూ పేనాలు తోడేశారు కనక కానీ, నేకపోతే రెడ్డెయ్య అమట్టున అక్కడే కూసుని ఉండేవోడు. పెళ్లిసావిట్లో కెళుతున్నా పేణాలక్కడే ఉన్నాయి రెడ్డెయ్యకి. "అవునొదిలి రామాకు. ఇక్కడే ఉండు" అని ఈరిగాడికిసెప్పి అక్కడుంచి ఎళ్లలేక ఎళ్లలేక ఎల్లాడు పెళ్లిపందిట్లోకి.

కన్నేదానప్పీట్లమీన కూసున్నాడన్న మాటేగాని దేనం అంతా బట్లావుమీనే ఉంది రెడ్డెయ్యకి. శాస్తుల్లు సెప్పిందల్లా సేస్తున్నాడేకాని ఆలోశనంతా ఆవుమీనే. మద్దిలో పెద్దబావమర్దిని పిలిసి "ఆవు ఎలా ఉందో ఓపాలి ఎల్లి సూసిరా" అని పంపాడు.

బాజాబజంత్రీల సప్పుళ్లూ, పురోయితయ్య మంత్రాలూ, పెళ్లోరి కబుర్లూ, ఆడంగుల అరుపులూ ఇయేయీ సెవుల్లో పట్టంలేదు రెడ్డెయ్యకి. సాల్లోంచి 'అమ్బా' అనే అరుపే ఉండుండి ఇనిపిస్తోంది. కండువాతో కళ్లు వొత్తుకున్నాడు.

అది సూసి తనక్కాబోయే ఇయ్యంకుడితో పక్కింటి నాగన్న "అటు సూడండి. అవును మరి! కన్నప్రేమా పెంచిన ప్రేమాను" అన్నాడు. ఆ మాటలు విని రెడ్డెయ్య ఒక్క మాటుగా ఈ లోకంలోకి వచ్చాడు.

సిట్టెమ్మ! తను అల్లారుముద్దుగా అరిసేతిలో పెట్టుకొని పెంచిన సిట్టెమ్మ. అడిగిందల్లా అమారుగా అవురుస్తూ కంట్లో పాపలాగ ఎంతో గారంగా సూసుకుంటూన్న తన సిట్టితల్లి ఇంకో గంటలో ఇంకోరిపిల్ల అయిపోతోంది. తెల్లారితే ఇంక తనింట్లో ఉండదు. అత్తారి లోగిట్లోకి అనువర్తంగా నడుసుకోడానికి రేపీపాటికి ఎల్లిపోతుంది.

ఈ ఆలోశనతో రెడ్డెయ్యకి కడుపులో ఏదో దేవినట్లయింది. గొంతుకలో ఉండకట్టినట్లు అనిపించింది. కళ్లు సెమ్మగిల్లాయి. కాళ్ళకి పసుపూ పారాణీ రాసుకొని, కళ్ళాన తిలకం, బుగ్గని సుక్కా పెట్టుకుని, కొబ్బరిబొండాం దోసిట్లో పట్టుకుని, పక్కనే బుట్టలో కూసున్న సిట్టెమ్మని సూశాడు. కళ్లల్లో సిగ్గేకాని సీకటేం కనిపించలేదు రెడ్డెయ్యకి.

"పిచ్చితల్లి! పోనీ అదీ ఒక నయ్యమే. ఈ ఎర్రిమొర్రి ఆలోశన్లతో నేనేం సుకపడుతున్నాను కనక!"

బాజాల సద్దు అణిగిన సంగతే పట్టలేదు రెడ్డెయ్యకి. ఉన్నట్టుండి బాకాలూ

సన్నాయిలూ బయ్‌మన్నాయి. రమడోలు మోగుతోంది. తాషామర్బావోడు రెచ్చిపోయి వాయిస్తున్నాడు. పురోహితయ్య 'మాంగల్య తంతునానేన ...” అంటూ మంత్రం సదువుతున్నాడు. అల్లుడు లేసి ఓమారు పంచెకొంగూ మరోమారు ఉత్తరీయం సద్దుకుని రెండు సేతుల్తోనూ శతమానం సివళ్లు పట్టుకుని నిలబడ్డాడు. రెడ్డెయ్య సిన్నసెల్లెలు, పెళ్లికూతురి పూలజడ ఎత్తిపట్టుకుంది.

రెడ్డెయ్య మనస్సులో ఆనందం

గుండెల్లో ఎర్రిబాదా

సెంపలమీంచి కారుతూన్న కన్నీళ్లూ

ముప్పేటగా మూడు ముళ్లుగా సాగాయి.

మనస్సులో బాగానూ ఉంది. బాదగానూ ఉంది.

సెప్పలేనంత అయోమయంగా ఉంది.

రాతిబొమ్మలా పరద్దానంగా ఉండిపోయాడు రెడ్డెయ్య.

మంత్రాలాపి "అక్షింతలెయ్యండి" అని శాత్తుల్లు అరిశాక ఉలిక్కిపడి ఈ లోకంలోకి వొచ్చాడు రెడ్డెయ్య.

సెంపలమీంచి కారుతూన్న కన్నీళ్లు, పైమీది కండువాతో తుడుసుకుంటూ దంపతుల మీద అక్షింతలు జల్లాడు రెడ్డెయ్య.

పెద్ద బరువు దింపుకొన్నట్టూ, మరో పెద్ద బెంగ నెత్తికెత్తుకున్నట్టా అనిపించింది.

ఎంటనే ఎన్నులో కలుక్కుమంది.

"నా తల్లి నాకు బరువా? అయ్యో బగమంతుడా? ఏంటి నాకీ ఎదవ ఆలోశన? అవున్లే ... నా బుద్ధి ఇలా ఉంది కనకే రేపు ఎల్లిపోతోంది నా సిట్టెమ్మ. నా తల్లితోటే ఎల్లిపోతుంది ఈ ఇంటి ఎలుగు కూడా. సిట్టితల్లి లేనిలోటు ఎవరు తీరుస్తారు? ఎలా తీరుతుంది?"

పరద్దేనంలో సివరి మాటలు పైకనేశాడు రెడ్డెయ్య.

ఇంతలో రొప్పుకుంటూ పెళ్లిసావిట్లోకి వచ్చి "అయ్యగోరూ! బట్లావీనింది. పెయ్యుదూద!" అని అరిశాడు ఈరిగాడు.

రెడ్డెయ్య మొహం ఇంతయింది.

"ఆఁ! నిజంగా! వస్తున్నా. నడు ... రావులమ్మ తల్లీ" అంటూ సేతులెత్తి దణ్ణం ఎట్టాడు.

తన కాళ్లకి దణ్ణం ఎడుతూన్న అల్లుణ్ని లేవనెత్తి కౌగిలించుకొని "అబ్బాయీ! నువ్వు లోగిట్లో కాలెట్టిన ఏళ! బట్లావు ఇన్నాళ్ళకి పెయ్యదూడ నెట్టింది. నువ్వు మా సిట్టెమ్మని తీసికెళ్లి పోతున్నావుగదా అని దేవుడు నాకో సిట్టినిచ్చాడు" అంటూ గబగబా ఏదో సెప్పుకుపోయాడు రెడ్డెయ్య.

అల్లుడికేం అర్థంకాక పక్కనే తలంచుకొని నిలబడ్డ సిట్టెమ్మకేసి సూశాడు.

"వస్తా ... వస్తా" అంటూ గబగబా రెడ్డెయ్య గొడ్లసాలవేపు పరిగెట్టాడు.

* * *

పండగలకని వచ్చిన కూతురూ, అల్లుడూ పండగనాడు సాయంత్రం, పెరట్లోని గచ్చువాకిట్లో కూసుని వాదించుకుంటూ ఉంటే, అప్పటికే సిట్టి సిట్టి కొమ్ములూ సిన్నమూపురం ఆనమాళ్లుగా రూపుదేలుతూ ఏపుగా పెరిగి పెయ్యదూడ మెడలో, సిన్నమువ్వలు తీసి పెద్దమువ్వలు కట్టడానికి వంగిన రెడ్డెయ్య మువ్వలతాడు సేత్తో పట్టుకుని, నిటారుగా లేచి నిలబడి, "అయితే అల్లుడేం అంటాడు?" అన్నాడు.

"ఆయనేం అలా అనే మనిషి కాదు నాన్నా. మా అత్తగారే అంటున్నారు. "రేపు ఇంట్లో ఓ నలుసు బయల్దేరితే ఆ బిడ్డకి ఆవుపాలు అవసరం అవుతాయి. ఆవుని కొనడం మనకి ఆనవాయితీ లేదు. అత్తారు ఇవ్వాలి అని" అంది సిట్టెమ్మ.

"ఓస్ అంతేకదా. నాకు మనవడినో మనవరాలినో మీరియ్యాలేకాని నేను మీకు ఆవుని తోలిబెట్టడం అదేమంత బాగ్యం. ఇస్తాను. సరా? ఏం సిట్టీ! అంతేకదూ?" అన్నాడు రెడ్డెయ్య.

సిట్టి తలాడించింది. మెడలో పాత మువ్వలు గల్లుమన్నాయి.

అల్లుడు నవ్వాడు. గట్టిగా నవ్వాడు.

కొత్తమువ్వలు కట్టబోతూన్న రెడ్డెయ్య వెనక్కి తిరిగి "ఏం? నవ్వుతావేం?" అన్నాడు.

అల్లుడు నవ్వు తగ్గించుకొని "మహపెంకిగా తలూపుతోంది. దీన్నే తోలి పెట్టేయండి మా ఇంటికి" అన్నాడు.

రెడ్డెయ్య గతుక్కుమన్నాడు. ఒక్కసారి అల్లుడికేసి సూశాడు. ఎంటనే సిట్టి

ముకంముద్దెట్టుకుని గుండెలకి ఆనించుకొని దాని ముకం సుట్టూ సేతులు సుట్టేసి దగ్గిరగా తీసుకున్నాడు.

"నిజమే మావయ్యా! ఇప్పుడో ఆవుని కొనడం మళ్ళా దానికో ఖర్చూ ఇవన్నీ ఎందుకు? దీన్నే తోలేస్తే ..."

"దీన్నా? నా సిట్టినా?"

"అవును. రెండు మూడేళ్ళదాకా అదెల్లాగా అదునుకి రాదు. ఈలోగా దీన్ని మేపడం బాధేనా తప్పుతుంది మీకు. ఈనమోపయి ఇది తొలి ఈతకి వచ్చేసరికి కాని మాకు ఆవు పాల అవసరం రాదు. అప్పుడు అవసరమూ వస్తుంది. అప్పటికి ఇది అదునుకీ వస్తుంది. మాకూ, ఇంటబుట్టిన పెయ్యదూడని ఇచ్చావన్న ఆనందమూ ఉంటుంది".

"అల్లుడూ" గట్టిగా అరిచి ఆపైన ఏం అనలేక పోయాడు రెడ్డెయ్య. అల్లుడికేసి గుడ్లురిమి చూస్తూ ఉండిపోయాడు. కళ్లు ఎర్రగా మారాయి. పెదాలు వణకసాగాయి.

"ఏం? ఈ పసరం మాకియ్యకూడదా?" నిష్టూరంగా అన్నాడు అల్లుడు.

"అబ్బాయ్! నీకు ఎలా మాట్లాడాలో తెలియదు. సిట్టి సంగతి ఇంక ఇప్పుడూ ఎత్తమాకు".

"ఏం? ఏవంట?"

"అంతే .... సిట్టిని ఒక్కనాటికి తోలేది లేదు".

"ఆహా! అలాగేం? సరే ....." అని అల్లుడు ఆ సాయంత్రమే పండగ అనేనా ఆలోసించకుండా ప్రయాణానికి సిద్ధం అయ్యాడు, ఎంత మంది చెప్పినా వినకుండా.

* * *

ఈనమోపై ఉన్న సిట్టికి లేతగరికలందిస్తూ, మధ్య మధ్యన నడ్డి నిమురుతూ, గంగడోలు గోకుతూ రెడ్డెయ్య ఏదో ఆలోసిత్తున్నాడు. అతను వింటున్నాడో లేదో అనే ఊసైనా లేకుండా అతని భార్య .... ఊ ... సెప్పుకుపోతోంది.

"మద్దిన నాకు నక్క సావొచ్చిపడ్డది. ఏదో ఒక ఆవు ఇస్తాం అంటే ఆళ్ళొప్పుకోరు దేవుడా, సిట్టిని తోలెయ్యమంటే మీ రొప్పుకోరు. ఎలా సచ్చేది? మీ పట్టుదలల మద్దిన బిడ్డ ఎంత నలిగిపోతోందో! పురిటికని నిరుటి తొలిఏకాసికి పంపారు. పురుడెళ్లింది. పసిదాన్నీ తల్లినీ తీసికెళ్ళరు. మీరా పట్టుదల మానరు.